# నేడే ఆఖరు..

- సాయంత్రానికి ప్రచారానికి తెర
- ఎంపీ ఎన్నికలకు కౌంట్‌డౌన్
- ప్రధాన పార్టీల అధినేతల ఆగమనంతో పొలిటికల్ హీట్
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ స్థానాల్లో ఉత్కంఠ

మహబూబ్‌నగర్, మే 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శనివారంతో తెర పడనున్నది. నామినేషన్ల ఘట్టం ప్రారంభమైనప్పటి నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పల్లెలు, పట్టణాలు మైకులతో హోరెత్తాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఎండను సైతం లెక్కచేయకుండా ప్రచారం చేపట్టారు. అభ్యర్థులకు మద్దతుగా కేంద్ర, రాష్ట్ర అధినేతలు ప్రచారం చేయడంతో ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాలు ఎవరి ఖాతాలో పడతాయో అర్థంకాని పరిస్థితి నెలకొన్నది. నేటితో ప్రచారానికి తెర పడనుండడం తో ఆయా పార్టీలు ప్రలోభాలపై దృష్టి పెట్టాయి. కాంగ్రెస్, బీజేపీలు ఇతర పార్టీ నేతలకు భారీ ఎత్తున డబ్బు ఆశచూపి లబ్ధి పొందాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

**మూగబోనున్న మైకులు..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీలు చేస్తున్న ప్రచారానికి తెరపడింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, పట్నం నరేందర్‌రెడ్డితోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జీలు ప్రచారంలో పాల్గొన్నారు. రోడ్ షోలు, ఇంటింటి ప్రచారంతో ఓటర్లను ఆకట్టుకున్నారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో పాగా వేసేందుకు కాంగ్రెస్ నేతలు ప్రచారం చేపట్టగా.. బీజేపీ నేతలు కూడా ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. శనివారం సాయంత్రానికి ప్రచారానికి తెర పడనున్నది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రెండ్రోజుల సమయమే మిగలడంతో అన్ని పార్టీల నేతలు ఇంటింటి ప్రచారంపైనే దృష్టి సారించాయి.

**పాలమూరులో పొలిటికల్ హీట్..**

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానాలను ఎలాగైనా గెలుచుకోవాలని ఆయా పార్టీలు స్కెచ్‌లు వేశాయి. ఈక్రమంలోనే అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీలు అధినేతలు రంగంలోకి దిగా రు. బీఆర్ఎస్ అభ్యర్థి మన్నెకు మద్దతుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో నిర్వహించారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు అభ్యర్థి విజయం కోసం తీవ్రంగా కృషి చేశారు. సీఎం సొంత జిల్లా కావడంతో ఇక్కడ పోరు ప్రతిష్టాత్మకంగా మారింది. ఏకంగా ఆయన ఏడుసార్లు పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటించి ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ తరఫున పేటలో ప్రధాని మోదీ, ఆ పార్టీ సీఎంలు, కేంద్ర మంత్రులు ప్రచారంలో పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీకి మద్దతుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మూడు చోట్ల సభల్లో పాల్గొని ప్రచారానికి ఊపు తెచ్చారు. అన్ని పార్టీల ప్రచారంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోలాహలం నెలకొంది.

**ప్రలోభాలకు కాంగ్రెస్, బీజేపీల స్కెచ్..**

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాలను ఎలాగైనా గెలవాలని అధికార కాంగ్రెస్ పార్టీ బీజేపీలు కుమ్మక్కయ్యాయి. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో కొంతమంది ఎమ్మెల్యేలు బీజేపీకి ఓటెయ్యాలని సూచిస్తున్నారు. మరోవైపు నాగర్‌కర్నూల్‌లో బీజేపీ గెలిచే పరిస్థితి లేదు.. అందుకే అక్కడి నేతలు కాంగ్రెస్‌కు ఓటెయ్యాలని ప్రచారం చేస్తున్నారు. ఇక ప్రచారానికి ఒకేరోజు సమయం ఉండడంతో ప్రలోభాలకు దిగారు. ఇటు అధికార యంత్రాంగాన్ని.. అటు పోలీసులను అదుపులో పెట్టుకొని అన్ని పట్టణాలు, గ్రామాల్లో ప్రలోభాలకు తెరలేపింది. పాలమూరు జిల్లాలోని ఓ ఎస్సై ఇసుక అక్రమార్కులతో సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్‌కు ఓటేయాలని బహిరంగంగా సూచించడం చర్చనీయాంశంగా మారింది. ఓ నియోజకవర్గ ఎమ్మెల్యే అండదండలతో ఎస్సై ఈ విధంగా ప్రచారం చేసినట్టు పోలీసువర్గాల్లో కూడా చర్చ జరిగింది. అయినా ఆ ఎస్సైపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం. ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో కాంగ్రెస్, పోలీసులను అడ్డం పెట్టుకొని మద్యాన్ని పారించేందుకు స్కెచ్ వేస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా ఎక్సైజ్ అధికారులు బెల్ట్ షాపులకు వైన్‌షాపుల నుంచి భారీ ఎత్తున మద్యాన్ని సరఫరా చేయిస్తున్నారని తెలిసింది. ఇదంతా కాంగ్రెస్ పార్టీ మద్యమని.. ఉచితంగా ఇవ్వాలని హుకుం కూడా జారీ చేస్తున్నారట. మొత్తంమీద ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాలను మూడు ప్రధా పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రచారం చేపట్టాయి. ఇక ఓటర్లు ఎవరిని కరుణిస్తారో మరి..

## కేసీఆర్ హయాంలోనే మైనార్టీలకు ప్రాధాన్యం

- శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె



మహబూబ్‌నగర్ అర్బన్, మే 10 : కేసీఆర్ ప్రభుత్వంలో మైనార్టీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పించి వారికి అండగా నిలిచామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తూర్పుకమాన్‌లోని జామియా మసీదు వద్ద బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నెతో కలిసి మాజీ మంత్రి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో ఇమాంలు, మౌజంలకు గౌరవ వేతనం ఇచ్చామని గుర్తు చేశారు. మైనార్టీల కోసం గురుకులాలు తీసుకొచ్చామని, రూ.125కోట్లతో పాఠశాల భవనం నిర్మించామన్నారు. రూ.కోటితో హజ్‌హౌస్, నాలుగు శ్మశానవాటికలు కట్టించి వసతులు కల్పించామన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే మన్నెను మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, రెహమాన్‌తోపాటు బీఆర్ఎస్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



జడ్చర్లలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

## జాతీయ పార్టీలతో పేదలకు అన్యాయం

- బీఆర్ఎస్‌తోనే ప్రజాసంక్షేమం: మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి

జడ్చర్లటౌన్, మే 10 : కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో పేదలకు అన్యాయం జరిగిందని మాజీ మంత్రి, డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 25, 26, 27వార్డుల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కేవలం ఎన్నికల్లో మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకొని వెళ్లిపోతాయని, ప్రజాసంక్షేమం కోసం పాటుపడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ పార్టీయే అని ప్రజలకు వివరించారు. అమలుకానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పేదలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్, బీజేపీల మోసపు మాటలను నమ్మొద్దని, కారుగుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి మన్నెను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు

- రేవంత్‌రెడ్డికి ఓటుతోనే బుద్ధి చెప్పాలి: గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి




గంజిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, మే 10 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఓట్లు దండు కోవడానికి మరోసారి మాయమాటలు చెప్పడానికి వస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు మద్దతుగా గద్వాల మున్సిపాలిటీలోని పలు వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు అమలుకాని హామీలిచ్చి ప్రస్తుతం వాటిని అమలు చేయలేక సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు రోజుకో మాట మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మరోసారి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారుకు ప్రజలు ఓటుతోనే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ సహకారంతో గద్వాల మున్సిపాలిటీని ఎంతో అభివృద్ధి చేసుకున్నామని.. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్రంలో ఉన్న బీజేపీ తెలంగాణ అభివృద్ధికి నిధులు విడుదల చేయలేదని ఆరోపించారు. అందుకే ఆర్ఎస్పీని భారీ మెజార్టీతో గెలిపించుకొని నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు నాగిరెడ్డి, నరహరిశ్రీనివాసులు, దౌలు, మురళి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామేశ్వరమ్మ, నాయకులు వేణుగోపాల్, కృష్ణారెడ్డి, గోవిందు, సాయిశ్యాంరెడ్డి, ధర్మానాయుడు, సతీశ్‌కుమార్, కురుమన్న, వంశీ, సీతారాములు, మధు, లక్ష్మణ్, రాజు తదితరులున్నారు.



మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఎస్పీ నాయకులు శుక్రవారం గురుకుంటలోని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి స్వగృహంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఎస్పీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు శివకుమార్, శరత్‌స్వామి, కుమార్, సోను, నవీన్‌తోపాటు మరికొందరికి మన్నె గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, నాయకులు రాంప్రసాద్, ప్రతాప్, ముత్యాల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. - నవాబ్‌పేట, మే 10



హన్వాడలో నిర్వహించిన రోడ్ షోకు భారీగా హాజరైన ప్రజలు

**మరోసారి గెలిపించండి..**
**- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె**

తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే స్థాయికి కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చింది. అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశానికే దిక్సూచిలా మార్చిన బీఆర్ఎస్‌కు ప్రజలు ఎల్లవేళలా అండగా ఉండాల్సిన అవసరం ఉంది. పదేండ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణలోని ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదని అలాంటి పార్టీ మనకు అవసరమా ప్రజలు ఆలోచించాలి. కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలను చెప్పి గారడీ మాటలతో అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నది. ముఖ్యంగా రైతులు, ప్రజలను ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ముప్పుతిప్పలు పెడుతున్నదని, అలాంటి పార్టీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన అభ్యర్థులెవరూ స్థానికులు కాదని, నేను పక్కా లోకల్ అని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తానని తనను మరోసారి ఆదరించి ఎంపీగా గెలిపించాలి.

# కాంగ్రెసోళ్లు.. మాయగాళ్లు



రోడ్ షోలో పాల్గొన్న మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె

- సాధ్యం కాని హామీలతో అధికారంలోకి..
- మాజీ హోం శాఖ మంత్రి మహమూద్ అలీ
- పదేండ్ల కేసీఆర్ పాలనలో ఎప్పుడూ కరువు లేదు
- ప్రజాపాలనలో రేవంత్ ప్రభుత్వం విఫలం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- హన్వాడ రోడ్‌షోకు నీరా'జనం'

హన్వాడ, మే 10 : మాయమాటలు, సాధ్యంకానీ హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, నేడు హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం హన్వాడలో నిర్వహించిన రోడ్‌షోలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమూద్‌అలీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని సాధించిన తెలంగాణను పదేండ్లు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్ కావాలా.. ఢిల్లీ రాజకీయాలు మనకు కావాలా? ప్రజలు ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింకు ప్రాధాన్యం ఇచ్చిందని, రంజాన్‌కు కానుకగా దుస్తులు అందజేసిందని, ఆడబిడ్డల పెండ్లికి షాదీ ముబారక్‌తో రూ.లక్షా116 అందించి ఆదుకున్నదని గుర్తు చేశారు. అదేవిధంగా ఇమాం, మౌజంలకు గౌరవేతనాలు అందించిందని, మైనార్టీ విద్యార్థుల కోసం ప్రత్యేక గురుకులాలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి చేసిందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నదని ఆరోపించారు. మతతత్వ బీజేపీ, ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీలను భూస్థాపితం చేయాలని, స్థానికుడైన మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

**హస్తం పార్టీని నిలదీయాలి**

**: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

70 ఏండ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి తెలంగాణను మోసం చేసింది కాంగ్రెస్సే అని, అలాంటి పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలల్లోనే కరువు వచ్చిందని, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ కరువు పరిస్థితులు లేవని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలన ప్రజలకు పాతరోజులు గుర్తు చేస్తున్నాయని రైతులు అష్టకష్టాలు పడుతున్నారని, తాగునీరు, కరెంట్ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పదేండ్లు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీ చేయకుండా ఇప్పుడు దేవుడి పేరుతో ఓట్లు అడుగుతుందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్‌తోనే పేదలకు సంక్షేమం అందుతుందని ప్రజలు, కాంగ్రెస్, బీజేపీలను ఓడించి బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, ఎంపీపీ బాలరాజు, నాయకులు కొండ లక్ష్మయ్య, జంబులయ్య, శ్రీనివాసులు, నరేందర్, చెన్నయ్య, హరిచందర్, బసిరెడ్డి, శివకుమార్, ఆనంద్, ఖాజాగౌడ్, మోహన్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీని బొందపెట్టాలి



**ఆశీర్వదించండి.. అండగా ఉంటా..**

అలంపూర్ బిడ్డగా ప్రజాసేవ చేసేందుకు మీ ముందుకొచ్చాను. ఈ ఎన్నికల్లో నన్ను ఎంపీగా ఆశీర్వదిస్తే మీకు అండగా ఉండి సేవ చేస్తా. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతి సెగ్మెంట్‌లో అత్యాధునిక సౌకర్యాలతో విద్యాసంస్థలను స్థాపించి వేలాదిమంది పేద విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగేలా చూస్తా. ఉద్యోగ బాధ్యతల్లో ఉండగానే ఎంతో మంది విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దిన నాకు ప్రజాప్రతినిధిగా ఎన్నికైతే మరింత సేవ చేసే అవకాశం లభిస్తుంది. ఉద్యమాలు, దీక్షలు చేసి సాధించుకున్న జోగుళాంబ గద్వాల జిల్లాను రద్దు చేస్తే కాంగ్రెస్‌ను తెలంగాణ నుంచి తరిమిట్టాలి.

**- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి**



అయిజ రోడ్ షోలో పాల్గొన్న గులాబీ శ్రేణులు, కార్యకర్తలు

- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- హామీలను అమలు చేయని నేతలను నిలదీయాలి
- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- జిల్లాలను రద్దు చేస్తామన్న వారిని తరిమికొట్టాలి
- నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


అయిజ/వడ్డేపల్లి, మే 10 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు అబద్ధపు హామీలిచ్చి అమలు చేయని మోసకారి కాంగ్రెస్ పార్టీని బొందపెట్టాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. మతంపేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీని కూడా మట్టి కరిపించాలని కోరారు. శుక్రవారం అయిజలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ హామీలను నెరవేర్చని కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే నైతికహక్కు లేదన్నారు. గురుకులాల కార్యదర్శిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కు వేలాది మంది విద్యార్థులకు చక్కటి విద్యనందించిన ఘనత ఉందన్నారు. నడిగడ్డ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చాడన్నారు. అలంపూర్‌కు చెందిన ఆర్ఎస్పీకి నియోజకవర్గం నుంచి 50వేల పైచిలుకు మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

**నేతలను నిలదీయాలి**

అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు సంతోషంగా జీవించారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే అష్టకష్టాలు పడుతున్నారని విమర్శించారు. తాగు, సాగు నీటి ఇబ్బందులతోపాటు కరెంట్ ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మరోసారి మోసపోవద్దని, ఆర్ఎస్పీని గెలిపిస్తే కేంద్రంతో కొట్లాడి పరిశ్రమలు, విద్యాసంస్థల స్థాపనకు కృషి చేస్తారన్నారు. అంతకుముందు శాంతినగర్‌లో వడ్డేపల్లి, రాజోళి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ నర్సింహులు, సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, వడ్డేపల్లి, రాజోళి మండలాలకు చెందిన మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసులుతోపాటు నాయకులు అజయ్‌కుమార్, జగదీశ్వర్‌రెడ్డి, రోశన్న, గోపాల్, స్వాములు, తి రుమల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్, మన్నెపురెడ్డి, భరత్, ధర్మ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ఒక్క గ్యారెంటీ అమలు కాలేదు**

ఉండవెల్లి/మానవపాడు/పెబ్బేరు, మే 10 : కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒక్క హామీ కూడా అమలు కాలేదని ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా అన్నారు. శుక్రవారం ఉండవెల్లిలో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేయి గుర్తుకు ఓటేస్తే శఠగోపం పెట్టినట్లేనని ఎద్దేవా చేశారు. ఐదు నెలల కాంగ్రెస్ పాలనను ప్రజలు చూసి విసుగు చెందారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిపారని గుర్తు చేశారు. అబద్ధాలు, మోసపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఐదు నెలల్లోనే ప్రజలను అరిగోస పెడుతున్నదని ఆరోపించారు. మరోసారి కాంగ్రెస్ పార్టీ గారడీ మాటలు నమ్మవద్దని, కారు గుర్తుకు ఓటు వేసి అలంపూర్ బిడ్డ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పార్లమెంట్‌కు పంపించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మానవపాడు, వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలోనూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్పీ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలను నమ్మవద్దని, బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్‌రెడ్డి, శేషిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.






అయిజ రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయుడు, చిత్రంలో ఎమ్మెల్సీ చల్లా, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీ

## ఆర్ఎస్పీ గెలుపు ఖాయం

- ఐదు నెలల్లోనే కాంగ్రెస్‌పై వ్యతిరేకత
- రేవంత్ సర్కారుకు గుణపాఠం తప్పదు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- వనపర్తిలో ఎన్నికల ప్రచారం

వనపర్తి, మే 10 : నాగర్‌కర్నూల్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో మేధావులు, ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఓటు వేస్తామని స్వచ్ఛందంగా చెబుతున్నారని, దీంతో ఆర్ఎస్పీ గెలుపు ఖాయమైందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్, సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఐదు నెలల్లోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లుగా భావించి కోట్లాది రూపాయలు ఖర్చు చేశామని గుర్తు చేశారు. తెలంగాణలోని వనరులు దోపిడీకి గురికాకుండా ఉండాలంటే బీఆర్ఎస్ ఉండాలని ప్రజలు గ్రహించారని తెలిపారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలు నమ్మి ఒకసారి మోసపోయిన ప్రజలు మరోసారి నమ్మేందుకు సిద్ధంగా లేరన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంట్ కష్టాలు, కరువును ఆహ్వానించినట్లేనని ఆరోపించారు. మన నీళ్లు, మన నీరు, మన కాల్వలు, మన కరెంట్ మనకు రావాలంటే బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించుకోవాలని, కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, వార్డు బీఆర్ఎస్ నాయకులు ఆవులరమేశ్ తదితరులు పాల్గొన్నారు.





వనపర్తిలో ప్రజలకు అభివాదం చేస్తూ ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

**ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలి**

గోపాల్‌పేట, మే 10 : యువత, విద్యార్థుల భవిష్యత్ బాగుపడాలంటే నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానంనుంచి బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఏదుట్ల, ఏదుల, చెన్నారం గ్రామాల్లో ఆర్ఎస్పీకి మద్దతుగా నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న 80లక్షల మంది మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించకుండా కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. మన ప్రాంతం వాడు, కష్టసుఖాలు తెలిసిన ఆర్ఎస్పీని గెలిపించుకుందామని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ చంద్రశేఖర్, ఎంపీటీసీలు బాల్‌రెడ్డి, మాజీ సర్పంచులు శ్రీలత, నాగమణి, రమేశ్, మాజీ ఉపసర్పంచులు క్రాంతిరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.